సాక్షి నల్లగొండ

మంగళవారం । 22 । ఏప్రిల్ । 2025



ఎస్సీ గురుకులాల్లో 'ఫోన్ మిత్ర'
ఎస్సీ గురుకుల పాఠశాలల్లో ఫోన్ మిత్ర పేరిట ప్రభుత్వం సరికొత్త కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. - 8లో



'శుభవార్త' ముస్తాబు
మఠంపల్లిలోని శుభవార్త చర్చి వార్షికోత్సవాలు ఈ నెల 24, 25 తేదీల్లో జరగనున్నాయి. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం 41°/23°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు మిర్యాలగూడ మంత్రి ఉత్తమ్ రాక

- ఇరిగేషన్, పౌరసరఫరాలపై సమీక్ష

మిర్యాలగూడ : రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మంగళవారం మిర్యాలగూడకు రానున్నారు. మధ్యాహ్నం 2.30గంటలకు స్థానిక టీఎస్‌ఆర్ గార్డెన్‌లో ఇరిగేషన్, పౌర సరఫరాల శాఖలపై సమీక్ష నిర్వహించనున్నారు. ఎడమ కాల్వ పరిధిలోని ఎత్తిపోతల పథకాల అభివృద్ధి పనులు, సాగర్ ప్రాజెక్టులోని నీటి నిల్వ, పౌరసరఫరాల శాఖ ద్వారా రేషన్ షాపుల్లో అందించే సన్నబియ్యం పంపిణీ, గోదాంలో బియ్యం నిల్వ, కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక తదితర అంశాలపై అధికారులతో సమీక్షించనున్నారు. ఈ సమీక్షకు మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ, నకిరేకల్ నియోజకవర్గాలకు సంబంధించిన ఎమ్మెల్యేలు, అధికారులు హాజరుకానున్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందాలి



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

నల్లగొండ : బాధితులకు సత్వర న్యాయం అందేలా సిబ్బంది పని చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవర్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 30 మంది బాధితుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించి మాట్లాడారు. బాధితుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, పోలీస్‌స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించాలని సిబ్బందికి సూచించారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. చట్టవ్యతిరేకమైన చర్యలు చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు.

కొనసాగుతున్న 'ఓపెన్' పరీక్షలు

నల్లగొండ : ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు సోమవారం కొనసాగాయి. ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 1902 మందికి 1623 మంది హాజరయ్యారు. 279 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ టెన్త్ పరీక్షకు 1464 మందికి 1235 మంది హాజరు కాగా 229 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఐసీహెచ్ పరీక్షకు 8 మందికిగాను ఆరుగురు పరీక్ష రాయగా, ఇద్దరు పరీక్షకు హాజరు కాలేదు. పరీక్ష కేంద్రాలను డీఈఓ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి.

దరఖాస్తులకు నేడు ఆఖరు

నల్లగొండ : ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకం రెండో దశ దరఖాస్తులకు మంగళవారం (నేడు) ఒక్క రోజే గడువు ఉందని జిల్లా పరిశ్రమల శాఖ జేడీ వి.కోటేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 24 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి కుటుంబంలో ఎవరూ ప్రభుత్వ ఉద్యోగి ఉండొద్దని.. టెన్త్/ఇంటర్/ఐటీఐ/ పాలిటెక్నిక్ డిప్లొమా/ డిగ్రీ పూర్తి చేసి వార్షిక ఆదాయం రూ.8 లక్షలలోపు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి అర్హత గల వారు pminternship.mca.gov.in పోర్టల్‌లో లాగిన్ అయి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

రామగిరి(నల్లగొండ): వృత్తి కోర్సులు నేర్చుకోవడం వల్ల జీవన నైపుణ్యం పెంపొందుతుందని మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరాజు అన్నారు. వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో టెర్రస్ గార్డెనింగ్ (మిద్దె తోట) పై 30 రోజుల వ్యవధి గల సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సోమవారం కళాశాలలో సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో వృక్ష శాస్త్రం ఇన్‌చార్జ్ డాక్టర్ టి. అరవింద, వృక్షశాస్త్ర అధ్యాపకులు ఎ.సంధ్య, డాక్టర్ జి.సరిత, డాక్టర్ పి.సునీత, అతుఫా పాల్గొన్నారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

మండుతున్న ఎండలు
- 41 డిగ్రీలకు చేరిన నగటు ఉష్ణోగ్రత
- బయటికి వెళ్లేందుకు జంకుతున్న జనం

నల్లగొండ టౌన్ : భానుడు తన ప్రతాపాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఉదయం 9 గంటల నుంచే ఎండలు మండిపోతున్నాయి. జనం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వాతావరణంలో గాలితో తేమశాతం పడిపోతుండడంతో ఫ్యాన్లు, ఏసీలు లేకుండా ఉండలేని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని మాడుగులపల్లిలో సోమవారం జిల్లాలో నగటు ఉష్ణోగ్రత 41 డిగ్రీలు నమోదైంది. మధ్యాహ్నం వేళ బయటికి వెళ్లాలంటేనే జనం జంకుతున్నారు. ఉదయం 11 గంటలకే ఆయా పట్టణాల్లోని ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారి కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. పాదాచారులు, దినసరి కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, ఉపాధి హామీ కూలీలు ఎండల కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. ఏప్రిల్ చివరి వారంలోనే ఎండలు మండుతుంటే మేలో పరిస్థితి ఎలా ఉంటుందోనని జనం ఆందోళన చెందుతున్నారు.

ఏసీలు, కూలర్లకు పెరిగిన గిరాకీ..
ఎండల మండుతుండడంతో ఏసీలు, కూలర్లకు గిరాకీ పెరిగింది. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ప్రజలు పెద్ద ఎత్తున కూలర్లను కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో కూలర్ ధర కంపెనీని బట్టి రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంది. ఏసీలు కూడా రూ.40 వేల నుంచి రూ.లక్ష వరకు ధర ఉన్నాయి.



వైద్యుల సూచనలు ఇలా..
- వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో భాదపడుతున్నా వారు, చిన్న పిల్లలు ఎండలో తిరగవద్దని, తప్పని సరిగా బయటికి వెళ్లాల్సి వస్తే వదులు కాటన్ దుస్తులు ధరించాలి. టోపీ లేదా రుమాలు తలకు చుట్టుకోవాలి.
- నీటిని ఎక్కువగా తాగాలి. డీహైడ్రేషన్ కాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు నీటిలో కలుపుకుని తాగాలి. మజ్జిగ, నిమ్మరసం తీసుకోవాలి.
- నాన్‌వెజ్, హోటల్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి.
- వడదెబ్బ బారిన పడితే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

సోమవారం ఆయా మండలాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్ డిగ్రీలలో)

మండలం	ఉష్ణోగ్రత		
మాడ్గులపల్లి	43.0	తిప్పర్తి	41.5
మిర్యాలగూడ	42.7	మునుగోడు	41.4
అనుముల	42.7	దేవరకొండ	41.3
చిట్యాల	42.6	కనగల్	41.2
నిడమనూరు	42.6	పెద్దవూర	41.2
చండూరు	42.5	గుండ్లపల్లి	41.1
దామరచర్ల	42.5	కొండమల్లేపల్లి	41.0
తిరుమలగిరిసాగర్	42.1	కేతేపల్లి	40.9
నల్లగొండ	41.9	కట్టంగూర్	40.7
వేములపల్లి	41.6	గుర్రంపోడు	40.7
నార్కట్‌పల్లి	41.6	పీఏపల్లి	40.4
త్రిపురారం	41.6	నాంపల్లి	40.4
		అడవిదేవులపల్లి	40.4

రేషన్ కార్డులేక.. బియ్యం అందక..

- పాతకార్డుల్లోనూ పేర్లు తొలగింపు
- మార్పులు, చేర్పుల అర్జీలు పెండింగ్‌లోనే..
- నిరీక్షణలో 69,473 మంది దరఖాస్తుదారులు



నల్లగొండ: కొత్త రేషన్‌కార్డులతోపాటు పిల్లల పేర్లు చేర్పించేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి నేటికీ కార్డులు మంజూరు కాలేదు. దీంతో ఆయా దరఖాస్తుదారులందరికీ ఇప్పట్లో సన్న బియ్యం అందే పరిస్థితి కనిపించడం లేదు. ఇదిలా ఉంటే కొత్తగా పెళ్లైన వారు రేషన్ కార్డు కోసం అర్జీపెట్టుకోగా పాత కార్డులో వారి పేర్లు తొలించారు. దీంతో జిల్లాలో 69 వేల మందికిపైగా ఇటు పాత కార్డుపై బియ్యం అందక, కొత్త కార్డు రాక రేషన్ బియ్యానికి దూరం అవుతున్నారు.

దరఖాస్తులు స్వీకరించి..
గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2022లో కొంత మందికి ఫుడ్ సెక్యూరిటీ కార్డులు అందించింది. ఎన్నికల ముందు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు. దీంతో జనం పెద్దఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. అదే సమయంలో కొత్తగా పెళ్లైన వారు కొత్త కార్డులకు దరఖాస్తు చేసుకున్నారు. దాంతో వారిపేర్లు పాత కార్డుల్లో తొలగించారు. ఎన్నికల తరువాత కార్డులు ఇస్తారని భావించారు కానీ ప్రభుత్వం మారవడంతో సాధ్యం కాలేదు. కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం పెట్టి అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇస్తామని చెప్పి దరఖాస్తులు స్వీకరించింది. దీంతో జిల్లాలో 1,25,733 మంది రేషన్ కార్డులకోసం దరఖాస్తు చేసుకున్నారు. మరలా బీసీ కులగణన సమయంలో 27,523 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అలాగే సవరణల కోసం 37,229 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటన్నింటిని పరిశీలించిన జిల్లా అధికారులు దాదాపు 69,473 దరఖాస్తులను అప్రూవల్ చేసి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అధికారులకు పంపించారు. వీటిని ప్రభుత్వం ఇంకా ఓకే చేయలేదు. దీంతో దరఖాస్తుదారులకు నిరీక్షణ తప్పడం లేదు.

కొత్త వారికి మరింత సమయం!
అయితే జిల్లా అధికారులు అప్రూవల్ చేసిన రేషన్‌కార్డు దరఖాస్తులపై ప్రభుత్వం నుంచి అనుమతి వస్తేనే జిల్లాలో ఆ కార్డుదారులకు సన్న బియ్యం ఇచ్చే అవకాశం ఉండనుంది. అయితే జిల్లాలో ఉన్న డేటా అంతా ఆన్‌లైన్ చేస్తున్నట్లు సమాచారం. దీంతో మరో రెండు నెలల వరకు సమయం పట్టే అవకాశం ఉంది. అప్పటిదాకా అధికారులు అప్రూవల్ చేసిన జిల్లాలోని దరఖాస్తుదారులకు సన్న బియ్యం అందేది కష్టమని తెలుస్తోంది.

కొత్త రేషన్‌కార్డు రాలేదు



నాకు పెళ్లి కాక ముందు అమ్మ నాన్నల రేషన్ కార్డులో నా పేరుంది. పెళ్లయింది పిల్లలు కూడా ఉన్నారు. ఆ కార్డులో వారి పేర్లు లేవు. ఆరు నెలల క్రితం కొత్త కార్డుకు దరఖాస్తు చేసుకున్నా. కొత్తకార్డు రాలేదు. నాకు సన్న బియ్యం అందడం లేదు. – చంద్రశేఖర్, బొట్టుగూడ, నల్లగొండ

రేషన్ బియ్యం రావడం లేదు



రేషన్ కార్డులో నా కుమారుడి పేరు ఎక్కించేందుకు చాలా రోజుల క్రితం దరఖాస్తు చేసుకున్న. ఇంతవరకు పేరు ఎక్కలేదు. పలుమార్లు అధికారులను అడిగినా పట్టించుకోవడం లేదు. నాలుగేళ్లుగా మా బాబుకు బియ్యం రావడం లేదు. – సంగెపు నవీన్, శాబ్దుల్లాపురం, కనగల్ మండలం

ప్రభుత్వం నుంచి అనుమతి వస్తేనే..
కొత్త రేషన్‌కార్డులకు చేసుకున్న దరఖాస్తులన్నింటినీ పరిశీలించి అర్హుల జాబితాను పౌర సరఫరాల శాఖకు పంపించాం. ప్రభుత్వ అనుమతి వచ్చిన తరువాత ఉన్నతాధికారుల ఆదేశానుసారం సన్న బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుంటాం. – హరీష్, సివిల్ సప్లయ్ డీఎం, నల్లగొండ

భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం



చందంపేటలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, సత్యం, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

- ఆధార్ కార్డు మాదిరిగానే.. భూదార్ కార్డు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- చందంపేటలో భూ భారతి చట్టంపై అవగాహన

చందంపేట : ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గతంలో ధరణిలో గత ప్రభుత్వం చాలా తప్పిదాలు చేసిందని, రైతులను ఇబ్బందులకు గురిచేసే పనులు చేసిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వ రైతులకు మేలు చేకూర్చాలనే ఉద్దేశంతో భూ భారతిచట్టం–2025ను తీసుకొచ్చిందన్నారు. చందంపేట మండల కేంద్రంలో సోమవారం భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి.. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భూ భారతి చట్టం ద్వారా తహసీల్దార్ స్థాయిలోనే ఎక్కువగా భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. మే 1 నుంచి అన్ని జిలాల్లో ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేస్తామన్నారు. చందంపేటను కూడా పైలెట్ ప్రాజెక్టుగా చేర్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం 6వేల మంది లైసెన్స్ సర్వేయర్లను నియమించనున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డులాగే రైతులకు భూదార్ కార్డులను అందజేయనున్నట్లు తెలిపారు. గతంలో భూమి అమ్మినా.. కొన్నా.. మ్యాపింగ్ ఉండేది కాదని, ఇకపై రాష్ట్ర వ్యాప్తంగా భూమి రిజిస్ట్రేషన్ సమయంలోనే సర్వే మ్యాపింగ్ తప్పనిసరి చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ వెనుకబడిన ఈ ప్రాంతంలో భూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, సాగర్ ముంపునకు గురై ఇక్కడికి వచ్చిన రైతులే ఎక్కువ మంది ఉన్నారని, డీఫారెస్ట్ పట్టాలు కలిగి ఉన్న రైతుల వివరాలు ఆన్‌లైన్ నుంచి తొలగించబడ్డాయని అన్నారు. చందంపేట మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని భూ సమస్యలు పరిష్కరించాలని మంత్రిని కోరారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ భూ భారతి చట్టం ద్వారా రైతుల సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతాయన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా నిజమైన రైతులకే లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కాగా.. రైతులు ప్రస్తావించిన సమస్యలపై ఆర్డీఓ నుంచి సరైన సమాధానం రాకపోవడంపై మంత్రి.. ఆర్డీవోను మందలించారు. అనంతరం నేరెడుగొమ్ము మండల కేంద్రంలో రైతులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆర్డీవో రమణారెడ్డిలు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఏఎస్పీ మౌనిక, ఆర్డీఓ రమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జమున మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొండ్ర శ్రీశైలంయాదవ్, కృష్ణయ్య, బద్యానాయక్, సర్వయ్య, గోవింద్‌యాదవ్, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

● తాటి ముంజలకు యమ గిరాకీ..





ఎండలు పెరగడంతో తాటి ముంజలకు గిరాకీ పెరిగింది. నల్లగొండ సమీపంలోని కట్టంగూరు, అయిటిపాముల, మామిడాల గ్రామాల నుంచి పలువురు జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ముంజలు విక్రయిస్తున్నారు. డజన్ రూ.60 నుంచి రూ.70 వరకు అమ్ముతున్నామని తెలిపారు. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

మానవాళికి సోషలిజమే ప్రత్యామ్నాయం

- మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : మానవాళికి సోషలిజమే ప్రత్యామ్నాయమని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం మిర్యాలగూడలో నిర్వహించిన సీపీఎం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ఎర్రజెండాకు ఆదరణ పెరుగుతోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎజెండా లేకుండా ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నారని విమర్శించారు. మోదీ ప్రభుత్వం మత రాజకీయం చేస్తూ ప్రజలను రెచ్చగొడుతోందన్నారు. ఎర్రజెండా ఒక్కటే నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతుందన్నారు. మేడే రోజున మిర్యాలగూడలో జరిగే మహా ప్రదర్శనకు కార్మికులు, పేదలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు నూకల జగదీశ్చంద్ర, గాదె పద్మ, ముడావత్ రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, శశిధర్‌రెడ్డి, వినోద్‌నాయక్, రొండి శ్రీనివాస్, రెమడాల పరుశురాములు, రాగిరెడ్డి మంగారెడ్డి, చౌగాని సీతారాములు, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధ్యక్ష పదవిని బీసీలకు ఇవ్వాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండ టౌన్: బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవిని బీసీలకు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. అప్పుడే 2028లో ఆ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. సోమవారం నల్లగొండలోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ 11 సార్లు సంస్థాగత ఎన్నికలను నిర్వహిస్తే 11 సార్లు కేసీఆర్ అధ్యక్షుడయ్యారని జనాభాలో సగం కూడా లేని వెలమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి 11 సార్లు ఎలా అధ్యక్షుడవుతాడని ప్రశ్నించారు. ఈసారి అయినా బీసీలకు అధ్యక్ష పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి ఎన్నికల్లో ఓట్లు అడిగిన బీజేపీ ఎన్నికల అనంతరం ఆ పార్టీకి ఫ్లోర్ లీడర్లుగా బీసీల ఎందుకు అవకాశం కల్పించలేదన్నారు. బీజేపీ కూడా అధ్యక్ష పదవిని బీసీలకు ఇస్తేనే రాష్ట్రంలో మనుగడ ఉంటుందన్నారు. రెండు రోజుల్లో హైదరాబాద్‌లో మేధావులు, కుల సంఘాల నాయకులతో సెమినార్ నిర్వహించి ఈ రెండు పార్టీల కుల రంగును బయట పెడతామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, నల్ల సోమమల్లయ్య, నకిరెకంటి కాశయ్యగౌడ్, చిక్కుళ్ల రాములు, చొల్లేటి రమేష్, బూడిద మల్లికార్జున్, జిల్లా ఆదినారాయణ, గంజి భిక్షమయ్య, గుండా కోటప్ప, అంజయ్య, లింగస్వామి, నల్ల మధు, సైదులుగౌడ్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా కానివ్వం

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

సాక్షి ఎఫెక్ట్..

మిర్యాలగూడ : ఇసుక అక్రమంగా రవాణా కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. 'ఆగని ఇసుక దందా' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. ఇసుక అక్రమ రవాణాపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని జిల్లా గనులు, భూగర్భజలశాఖ సహాయ సంచాలకుడు జాకోబ్‌ను సోమవారం ఉదయం ఆదేశించారు. ఆయన వెంటనే విచారణ జరిపి నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. అధికారి సమర్పించిన నివేదిక ప్రకారం.. మూసీ, పాలేరు వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా కావడం లేదని, కేవలం రావులపెంట, బొమ్మకల్ నుంచి అనుమతి ఉన్న వాహనాలకు మాత్రమే ఇసుకను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వంగమర్తి ఇసుక రీచ్ వద్ద అవుట్‌పోస్ట్ ఏర్పాటు చేశామని.. అక్కడి నుంచి వచ్చే ప్రతి ఇసుక వాహనాన్ని పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. వంగమర్తి ఇసుక రీచ్ నుంచి కేవలం అనుమతించిన వాహనాలు వెళ్తున్నాయని, ఇప్పటివరకు ఎలాంటి ఓవర్ లోడ్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు. వైటీపీఎస్, కేఎస్ఆర్ సంస్థ పనులకు అనుమతులు ఉన్న ఇసుక మాత్రమే వెళ్తుందని తెలిపారు. సవరించిన ధరల ప్రకారం ట్రాక్టర్ ఇసుక రూ.4800కు అందుబాటులో ఉంచామని వివరించారు. గడిచిన రెండు రోజుల్లో ఇసుక వాహనం ద్వారా సుమారు 150 ట్రిప్పులను డెలివరీ చేశామని.. ఇప్పటికే బుకింగ్ చేసుకున్న మరో 300 ట్రిప్పులను రెండు రోజుల్లో డెలివరీ చేయడం చేస్తామని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకుగాను రెవెన్యూ, పోలీస్, మైనింగ్ తదితర శాఖల ద్వారా పూర్తి స్థాయిలో తనిఖీకి సిబ్బంది ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఒకవేళా ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేస్తే రూ.50 వేల వరకు జరిమానా విధించడంతోపాటు కోర్టుకు అప్పగిస్తామని హెచ్చరించారు.

పాఠ్య పుస్తకాలు వచ్చేస్తున్నాయ్!

- జిల్లాకు చేరిన 1.85 లక్షల పుస్తకాలు
- ప్రత్యేక నంబర్‌తో ముద్రణ
- పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు అందించేలా ప్రణాళిక

నల్లగొండ : పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి పాఠ్యపుస్తకాలు అందించే విధంగా విద్యా శాఖ చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే విద్యార్థులకు యూనిఫామ్‌కు సంబంధించి క్లాత్ రావడంతో మహిళా సంఘాలకు అప్పగించి కుట్టిస్తున్నారు. పాఠ్యపుస్తకాలు కూడా చేరుకుంటున్నాయి. జిల్లాలో మొత్తం 1483 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మొత్తం 5,89,970 పాఠ్యపుస్తకాలు అవసరం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు 1,98,100 పాఠ్య పుస్తకాలు జిల్లాకు చేరాయి. అంటే 33.57 శాతం పుస్తకాలు వచ్చాయి. వాటిని జిల్లా కేంద్రంలోని బుక్ డిపోలో భద్రపరుస్తున్నారు. ఇంకా 3,91,870 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉంది.



పాఠ్యపుస్తకాలను దింపుతున్న హమాలీలు

50 శాతం వచ్చాక పంపిణీ



50 శాతం పాఠ్య పుస్తకాలు జిల్లాకు వచ్చిన తర్వాత వాటిని ఆయా మండలాల వారీగా పంపిణీ చేస్తాం. పాఠశాలలు పునః ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. – భిక్షపతి, డీఈఓ

మీడియంల వారీగా..
పాఠ్యపుస్తకాలు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలలో ముద్రించారు. ఇక, పుస్తకాలు పక్కదారి పట్టకుండా వాటిపై ప్రత్యేక నంబర్లను ముద్రిస్తున్నారు. ఆ నెంబర్ల ఆధారంగా వచ్చిన పుస్తకాలను బుక్‌డిపోలో నమోదు చేస్తున్నారు. ఏ నంబర్ పుస్తకాలు ఏ మండలాలకు వెళ్తున్నాయో అని నమోదు చేస్తారు. ఇలా పుస్తకాలపైనే నంబర్లు ముద్రించడం వల్ల వాటిని బయట విక్రయించేందుకు అవకాశం ఉండదు.

సారూ.. మొర ఆలకించరూ..

- గ్రీవెన్స్ డేలో బాధితుల మొర

నల్లగొండ : సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని పలువురు బాధితులు కలెక్టరేట్‌కు వచ్చి అధికారులకు మొరపెట్టుకున్నారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై వచ్చిన బాధితుల నుంచి మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ అశోక్‌రెడ్డి, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి వినతులు స్వీకరించారు.

భూమి ఇప్పించాలి



పెళ్లయిన నాలుగేళ్లకే భర్త చనిపోయాడు. నాకు ఇద్దరు పిల్లలు. మా అత్త పేరుమీదున్న భూమిని ముగ్గురు ఆడ పడుచులే పట్టా చేయించుకున్నారు. మా వాటా ఇవ్వలేదు. అత్తా మామలు సహకరించకున్నా కూలి పని చేసుకుని పిల్లలను చదివించా. ప్రస్తుతం నా చిన్నకుమారుడి ఆరోగ్యం బాలేదు. డబ్బులన్నీ మందులకే ఖర్చవుతున్నాయి. మా వాటా భూమిని ఇప్పించి న్యాయం చేయాలి. – జిట్టబోయిన దీప, గూడపూర్, మునుగోడు మండలం

వేతనాలు ఇప్పించండి
జిల్లాలోని బీసీ సంక్షేమ హాస్టళ్లలో కుక్కింగ్ ఇతర పనులు నిర్వహించే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఐదు నెలలుగా వేతనాలు లేవు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మాకు పెండింగ్ వేతనాలు ఇప్పించి న్యాయం చేయాలి. – బీసీ హాస్టల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు



క్లుప్తంగా

బస్సును ఢీకొట్టిన డీసీఎం

● ఇద్దరికి గాయాలు

చిట్యాల: చిట్యాల పట్టణంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చిట్యాల పట్టణంలో నిలిపి ఉన్న ప్రైవేట్ బస్సును వెనుక నుంచి డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్‌తో పాటు మరొకరికి గాయాలయ్యాయి. జేసీబీ సహాయంతో బస్సు, డీసీఎంను రోడ్డు పక్కకు పోలీసులు తొలగించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పెన్‌పహాడ్: పెన్‌పహాడ్ మండలం సింగారెడ్డిపాలెం శివారులో సోమవారం ఎలుకల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేయగా.. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సదరు యువకుడిని ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ గోపికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలం పెదవీడు గ్రామానికి చెందిన బాణాల అన్వేష్ స్థానికంగా ఓ సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. సోమవారం పెదవీడు గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో తాను చనిపోతున్నానని అన్వేష్ మెసేజ్ చేసి సింగారెడ్డిపాలెం గ్రామ శివారులో ఎలుకల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో ఎస్‌ఐ గోపికృష్ణ తన సిబ్బందిని సింగారెడ్డిపాలెం శివారుకు పంపించి అన్వేష్‌ను చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అన్వేష్ ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

కారు ఢీకొని కంటెయినర్ డ్రైవర్ మృతి

చిట్యాల: హోటల్‌లో భోజనం చేసేందుకు హైవే దాటుతుండగా కారు ఢీకొని కంటెయినర్ డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో జరిగింది. సోమవారం ఎస్‌ఐ ఎన్. ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా హోమ్నాబాద్‌కు చెందిన మొహమ్మద్ జహీర్ పటేల్(47) ఆదివారం కంటెయినర్‌లో జిప్సం లోడుతో విశాఖపట్నంకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులోని గాంధీ గుడి సమీపంలోకి రాగానే అర్ధరాత్రి భోజనం చేసేందుకుగాను కంటెయినర్‌ను విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారికి పక్కన నిలిపాడు. అనంతరం ఎదురుగా ఉన్న హోటల్‌లోకి వెళ్లేందుకు జాతీయ రహదారి దాడుతుండగా.. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జహీర్ పటేల్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు అమ్జద్ పటేల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎస్సీ గురుకులాల్లో ఫోన్ మిత్ర

● ప్రతి పాఠశాలలో 10 టెలిఫోన్ బాక్స్‌లు ఏర్పాటు
● విద్యార్థులే నేరుగా ఫోన్‌లో తమ తల్లిదండ్రులతో మాట్లాడే అవకాశం
● ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు


బీబీనగర్ ఎస్సీ గురుకుల పాఠశాలలో ఫోన్ ద్వారా తల్లిదండ్రులతో మాట్లాడుతున్న విద్యార్థిని

బీబీనగర్: ఎస్సీ గురుకుల పాఠశాలల్లో ఫోన్ మిత్ర పేరిట ప్రభుత్వం సరికొత్త కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. గురుకులాల్లో చదివే తమ పిల్లలతో తల్లిదండ్రులు మాట్లాడాలంటే ఫోన్ సౌకర్యం లేక ఇబ్బందులు పడేవారు. ఏదైనా అత్యవసరం ఉంటే టీచర్ ఫోన్‌కు చేయడం తప్పితే.. సాధారణంగా మాట్లాడాలంటే తల్లిదండ్రులు హాస్టల్‌కు రావాల్సిందే. కానీ ఈ ఫోన్ మిత్ర కార్యక్రమం ద్వారా విద్యార్థులు కావాల్సినప్పుడల్లా తమ తల్లిదండ్రులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడుకునే సౌకర్యం ప్రభుత్వ కల్పిస్తోంది.

10 టెలిఫోన్ బాక్సులు ఏర్పాటు

ఫోన్ మిత్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి ఎస్సీ గురుకుల పాఠశాలలో గరిష్ఠంగా 10 టెలిఫోన్ బాక్స్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 29 ఎస్సీ గురుకుల పాఠశాలలు ఉండగా.. 15వేలకు పైగా విద్యార్థులు వాటిల్లో చదువుకుంటున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 7 ఎస్సీ గురుకుల పాఠశాలలు ఉండగా.. బీబీనగర్‌లోని ఎస్సీ గురుకుల పాఠశాలలో 720 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ గురుకులాల్లో టెలిఫోన్ బాక్స్‌లను విడతల వారీగా ఏర్పాటు చేస్తూ వస్తున్నారు.

ప్రత్యేక యాక్సెస్ కార్డుతో..

విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ నంబర్లు ఆయా పాఠశాలల్లోని టెలిఫోన్ బాక్స్‌లలో నిక్షిప్తమై ఉంటాయి. తల్లిదండ్రులతో మాట్లాడాలనుకున్న విద్యార్థులకు ప్రత్యేకంగా పంపిణీ చేసే యాక్సెస్ కార్డులను స్వైప్ చేసి ఉచితంగా మాట్లాడే అవకాశం ఉంటుంది. ఇన్నాళ్లు తల్లిదండ్రులతో మాట్లాడాలంటే అది కూడా అత్యవసరమైతేనే 40మంది విద్యార్థులకు కలిపి ఉండే హౌస్ మాస్టర్ అయిన టీచర్‌ను అడిగి ఫోన్ చేయాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఫోన్ మిత్ర కార్యక్రమం ద్వారా విద్యార్థులు నేరుగా తల్లిదండ్రులతో మాట్లాడుకోవడానికి ఫోన్ బాక్స్‌లు ఏర్పాటు కావడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చాలా సంతోషంగా ఉంది



అమ్మానాన్నతో మాట్లాడాలని అనిపించినప్పుడు మా వద్ద ఫోన్ లేకపోవడంతో మాట్లాడలేకపోతున్నాం. ఇప్పుడు పాఠశాలలో ఫోన్ బాక్స్‌లు ఏర్పాటు కావడంతో అమ్మానాన్నతో ఎప్పుడైనా మాట్లాడుకునే అవకాశం లభించడం చాలా సంతోషంగా ఉంది. – జోత్స్న, 7వ తరగతి, ఎస్సీ గురుకుల పాఠశాల, బీబీనగర్

విద్యార్థులకు ఇబ్బందులు తప్పాయి



తల్లిదండ్రులతో విద్యార్థులు మాట్లాడుకోవడానికి ఎస్సీ గురుకుల పాఠశాలల్లో టెలిఫోన్ బాక్స్‌లు ఏర్పాటు చేయడం శుభపరిణామం. ఇప్పటి వరకు విద్యార్థులు తమ హౌస్ మాస్టర్ అయిన టీచర్ ఫోన్ ద్వారా తల్లిదండ్రులతో మాట్లాడేవారు. ఇప్పుడు విద్యార్థులకు ఆ ఇబ్బందులు తొలగిపోయాయి. – రూప, ప్రిన్సిపాల్, ఎస్సీ గురుకుల పాఠశాల, బీబీనగర్

● కొంగలే ఆకులుగా..


యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలం అమ్మనబోలు చెరువులో ఏ చెట్టు చూసినా కొంగల గుంపుతో కనువిందు చేస్తున్నాయి. పొద్దస్తమానం ఆహారం కోసం తిరిగే కొంగలు సాయంత్రం కాగానే చెరువులోని చెట్లపైకి చేరుతుంటాయి. కొమ్మకొమ్మకో కొంగ వాలి చూపరులను ఆకర్షిస్తున్నాయి. – మోటకొండూరు

పిడుగుపడి పత్తి లోడు లారీ దగ్ధం

● 8గంటలు శ్రమించి మంటలు ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది


దగ్ధమైన పత్తి లారీ

నేరేడుచర్ల: పిడుగుపడి పత్తి లోడుతో వెళ్తున్న లారీ దగ్ధమైంది. ఈ ఘటన కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు, లారీ డ్రైవర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం చింతపల్లిలోని కవిత కాటన్ ఇండస్ట్రీస్ నుంచి 24 టన్నుల పత్తి లోడుతో లారీ బయల్దేరి తమిళనాడు రాష్ట్రం కోవిల్‌పట్టిలోని మహావిష్ణు స్పిన్నింగ్ మిల్లుకు వెళ్తోంది. మార్గమధ్యలో రాత్రి 11.30గంటల సమయంలో లారీ నేరేడుచర్లకు రాగానే ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో రహదారి పక్కన పిడుగు పడడంతో నిప్పు రవ్వ ఎగిరి లారీలోని పత్తిపై పడింది. చిల్లేపల్లి వద్దకు రాగానే లారీలోని పత్తి నుంచి మంటలు ఎగిసిపడ్డాయి. వెనుక నుంచి వస్తున్న వాహనాదారులు మంటలు గమనించి లారీ డ్రైవర్ రమేష్‌కు చెప్పడంతో అతడు లారీని రోడ్డు పక్కన ఆపి కిందకు దిగాడు. స్థానికులు నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. మిర్యాలగూడ నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది ఎంత ప్రయత్నించినా మంటలు అదుపులోకి రాలేదు. జేసీబీ సహాయంతో లారీలో నుంచి కొంత పత్తిని తొలగించడంతో మంటలు తగ్గుముఖం పట్టాయి. అనంతరం అగ్నిమాపక సిబ్బంది 8గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. లారీ పూర్తిగా దగ్ధమైంది. లారీతో పాటు అందులోని పత్తి దగ్ధం కావడంతో సుమారు రూ.80లక్షల నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్ నాయక్, పోలీస్ సిబ్బంది ఘటనా స్థలంలో ట్రాఫిక్‌కు అంతరాయం కల్గకుండా చూశారు.

డివైడర్‌ను ఢీకొట్టి ట్రాక్టర్ బోల్తా.. ఒకరు మృతి

● మరొకరికి తీవ్రగాయాలు

మునగాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై మునగాల మండలం ఆకుపాముల గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా.. మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానిక ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన పాలపాటి వీరబాబు(40)కొంతకాలంగా క్రితం ఖమ్మం జిల్లా వెంకటగిరికి వలస వెళ్లి అక్కడే స్థిర నివాసం ఏర్పరచుకున్నాడు. తాను పండించిన ధాన్యాన్ని అమ్మేందుకు సోమవారం వీరబాబు ట్రాక్టర్‌పై మిర్యాలగూడకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో వీరి ట్రాక్టర్ మునగాల మండలం ఆకుపాముల శివారులోకి రాగానే విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజన్‌పై కూర్చున్న వీరబాబుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు మునగాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోతకు గురైన రహదారికి మరమ్మతులు


మాధారంకలాన్ సమీపంలో కోతకు గురైన 365వ నంబర్ హైవే అంచు వద్ద పోసిన మట్టి

సాక్షి ఎఫెక్ట్..

శాలిగౌరారం: శాలిగౌరారం మండలంలో కోతకు గురైన 365వ నంబర్ జాతీయ రహదారి అంచులను సంబంధిత అధికారులు మట్టితో పూడ్చి వేయించారు. 'పగుళ్లతో ప్రమాదకరంగా 365వ నంబర్ హైవే' అనే శీర్షికన ఈ నెల 19న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు స్పందించి అంచులు కోతకు గురైన చోట మట్టిపోసి పూడ్చే పనులు చేపట్టారు. సమస్యను పరిష్కారమయ్యేలా కృషి చేసిన 'సాక్షి'కి వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం


మంటల్లో దగ్ధమవుతున్న కారు

కేతేపల్లి: ఇంజన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధమైంది. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ వద్ద సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మండలం ఇస్నాపూర్‌లో నివాసముంటున్న వి. వెంకట్రావు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాడు. వెంకట్రావు సోమవారం తన భార్యతో కలిసి కారులో హైదరాబాద్ నుంచి విజయవాడకు బయల్దేరాడు. మార్గమధ్యలో కేతేపల్లి మండలం కొర్లపహాడ్ వద్దకు రాగానే కారు ఏసీలో నుంచి నుంచి పొగలు వచ్చాయి. ఇది గమనించిన వెంకట్రావు దంపతులు కారును రోడ్డు పక్కకు నిలిపి కిందకు దిగారు. వెంటనే ఇంజన్‌లో మంటలు చెలరేగి నిమిషాల వ్యవధిలోనే కారుకు మొత్తం అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. నకిరేకల్ ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. బాధితుడు వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివతేజ తెలిపారు.

మందుబాబులకు జైలు శిక్ష, జరిమానా

సూర్యాపేటటౌన్: సూర్యాపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం రాత్రి నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 13మందిని సోమవారం సూర్యాపేట కోర్టులో హాజరుపర్చగా నలుగురికి జైలు శిక్షతో పాటు రూ.2వేల చొప్పున జరిమానా, మరో తొమ్మిది మందికి రూ.1000 చొప్పున జరిమానా విధిస్తూ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బీవీ రమణ తీర్పు వెలువరించినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్‌ఐ సాయిరాం తెలిపారు. మద్యం సేవించి ఎవరైనా వాహనాలు నడిపితే జరిమానాలతో పాటు జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు.

నీటి సంపులో దూకి వివాహిత ఆత్మహత్య


నాగమణి (ఫైల్)

సంస్థాన్ నారాయణపురం: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వివాహిత నీటి సంపులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా జూలకల్లు మండల కేంద్రానికి చెందిన జంజనం వెంకటేశ్వర్లు, లక్ష్మమ్మ దంపతులు 30ఏళ్ల క్రితం సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి వలస వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. వారి కుమారుడు మల్లికార్జున్ గుంటూరు జిల్లా మంగళగిరిలో నివాసముంటూ జ్యూయలరీ వర్క్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మల్లికార్జున్‌కు పల్నాడు జిల్లా కూరపాడు మండలం లగడపాడు గ్రామానికి చెందిన నాగమణి(25)తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇటీవల బంగారం ధరలు భారీగా పెరగడంతో సరైన పనిలేక మల్లికార్జున్ పుట్టపాకలో తన తండ్రి నూతనంగా నిర్మిస్తున్న ఇంటి పనులను చూసుకోవడానికి భార్య నాగమణితో కలిసి వారం క్రితం వచ్చాడు. వీరి కుటుంబంతో కొంతకాలంగా పలు విషయాలపై గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో నాగమణి నీటి సంపులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జగన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. నాగమణిని తన తల్లింద్రడుల దగ్గరకి పంపించకపోవడం, ఆమెకు సెల్‌ఫోన్ కూడా ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై సంపులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న 8మంది రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు, ఎస్‌ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న 8మందిని పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు సోమవారం విలేకరులకు వెల్లడించారు. హుజూర్‌నగర్‌కు చెందిన షేక్ ఖలీముద్దీన్, షేక్ అయూబ్ పాషా, పొట్టే పంగు కాటయ్య, తిరుమలశెట్టి రామమోహన్‌రావు, సామల నర్సింహారెడ్డి, మేళ్లచెరువు మండలం నల్లబండగూడేనికి చెందిన తోడేటి గోపికృష్ణ, గరిడేపల్లి మండలం రాయినిగూడేనికి చెందిన వాడపల్లి నర్సింహారావు, ఏపీలోని విజయవాడకు చెందిన పొట్టి కోటయ్య సులువుగా డబ్బులు సంపాదించాలని ముఠాగా ఏర్పడి కొంతకాలంగా ఆన్‌లైన్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లకు బెట్టింగ్ పెడుతున్నారు. బెట్టింగ్ పెట్టగా వచ్చిన డబ్బులు పంచుకుందామని వీరు ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఓ దుకాణం వద్దకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 8 సెల్‌ఫోన్లు, రూ.3,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరి బెట్టింగ్ యాప్‌లలో ఉన్న రూ.66,067ను ఫ్రీజ్ చేసి, సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ ముత్తయ్య, ఏఎస్‌ఐ బలరాంరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ మృతి


రాంబాబు (ఫైల్)

మునగాల: రోడ్డు ప్రమాదంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ మృతిచెందాడు. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై మునగాల మండలం ముకుందాపురం శివారులో సోమవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. మునగాల మండల కేంద్రానికి చెందిన నారగాని రాంబాబు(40) కోదాడలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. సోమవారం రాత్రి విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై కోదాడ నుంచి మునగాలకు వస్తుండగా.. మార్గమధ్యలో ముకుందాపురం వద్ద ముందు ఉన్న కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదలో రాంబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ

● ముగ్గురు ప్రయాణికులకు గాయాలు

చౌటుప్పల్: చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామ శివారులో సోమవారం తెల్లవారుజామున రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా సత్తుపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తోంది. ఏపీకి చెందిన మరో ఆర్టీసీ బస్సుకు చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామ శివారులోకి రాగానే అకస్మాత్తుగా బ్రేక్ డౌన్ అయ్యింది. దీంతో బస్సు డ్రైవర్ నక్క శ్రీనివాస్ ఎలాంటి సిగ్నల్స్ ఇవ్వకుండానే ఒక్కసారిగా బస్సును రోడ్డు కిందికి దింపాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న సత్తుపల్లి డిపో బస్సు డ్రైవర్ నియంత్రణ కోల్పోయి వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు మేఘన, సాయిప్రియాంక, మోహన్‌రావుకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. సత్తుపల్లి డిపో బస్సు డ్రైవర్ నరేంద్రకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ పేర్కొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగు బాధితుడికి అప్పగింత


బాధితుడికి బ్యాగు అప్పగిస్తున్న పోలీసులు

నిడమనూరు: వెండి వస్తువులు గల బ్యాగును ఆటో మర్చిపోగా.. నిడమనూరు పోలీసులు సీసీ కెమెరాల సహాయంతో ఆటోను గుర్తించి బ్యాగును బాధితుడికి అందజేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండల కేంద్రానికి చెందిన అన్నెబోయిన శివకుమార్ తన ఇంట్లో శుభకార్యానికి కావాల్సిన 25 తులాల వెండి వస్తువులను హైదరాబాద్‌లో కొనుగోలు చేసి బ్యాగులో పెట్టుకొని నిడమనూరుకు వస్తున్నాడు. అలీనగర్ (14వ మైలు) దగ్గర ఆటో దిగి నిడమనూరుకు వెళ్తూ.. ఆటోలో శివకుమార్ తన బ్యాగును మరిచిపోయాడు. వెంటనే నిడమనూరు పోలీసులను ఆశ్రయించగా.. సీసీ కెమెరాల సహాయంతో ఆటోను గుర్తించి బ్యాగును బాధితుడు శివకుమార్‌కు అందజేసినట్లు ఎస్‌ఐ వి. నరేష్ తెలిపారు.

యువకుడి అదృశ్యం.. కేసు నమోదు


శ్రీకాంత్

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం కుంట్లగూడెం గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుంట్లగూడెం గ్రామానికి చెందిన కానుగు శ్రీకాంత్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం తన భార్య విజయలక్ష్మిని చౌటుప్పల్ పట్టణంలోని ఆమె తల్లిగారి ఇంటి వద్ద దింపిన శ్రీకాంత్ తిరిగి కుంట్లగూడెం వెళ్తానని చెప్పి బయల్దేరాడు. రాత్రి అయినా కూడా శ్రీకాంత్ ఇంటికి చేరుకోకపోవడంతో అతడి తమ్ముడు సాయి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. బంధువులకు ఫోన్ చేసి ఆరా తీసినా శ్రీకాంత్ ఆచూకీ తెలియరాలేదు. దీంతో అతడి కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. శ్రీకాంత్ నలుపు, లేత నీలం రంగు చొక్కా, తెలుపు రంగు ప్యాంట్ ధరించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

వేసవిలో ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి

● టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్. రాములు


మాట్లాడుతున్న రాములు

సూర్యాపేటటౌన్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వేసవి సెలవుల్లో పూర్తిచేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి సీహెచ్. రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం టీఎస్ యూటీఎఫ్ సూర్యాపేట జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ×మన ఊరు–మన బడ్డి పథకంలో పూర్తిచేసిన పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తిచేయించేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. పాఠశాలల్లో పనిచేసే సర్వీస్ పర్సన్స్‌కు వేతన బకాయిలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే ప్రకటించాలని, నూతన పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. అనిల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా కోశాధికారి జి. వెంకటయ్య, జిల్లా కార్యదర్శులు ఆర్. దామోదర్, ఎన్. నాగేశ్వరరావు, వి. రమేష్, డి. లాలు, కె. జ్యోతి, డి. శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవానికి 'శుభవార్త' ముస్తాబు

● 24, 25 తేదీల్లో వేడుకలు


విద్యుత్ దీపాల వెలుగుల్లో శుభవార్త చర్చి

మఠంపల్లి: మఠంపల్లిలోని శుభవార్త చర్చి వార్షికోత్సవానికి సిద్ధమైంది. ఈ నెల 24, 25 తేదీల్లో వేడుకలు నిర్వహించేందుకు చర్చిని విద్యుద్దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. మఠంపల్లిలో శుభవార్త చర్చిని 1908 నుంచి 1915 మధ్యకాలంలో నిర్మించారు. దీనిని 110 ఏళ్ల క్రితం మొదటి రెవరెండ్ ఫాదర్ ఫాస్కలీ స్థానిక క్రైస్తవుల సహకారంతో ప్రారంభించారు. చర్చి ప్రాంగణంలోని కొలనులో ఆరోగ్యమాత(మేరీమాత) విగ్రహం ఉంది. శిథిలావస్థకు చేరిన ఈ చర్చిని 1984లో స్థానిక క్రైస్తవ పెద్దలు సుమారు రూ.50లక్షలతో 100 అడుగుల ఎత్తు గల రెండు గోపురాలతో అద్భుతంగా పునఃనిర్మించారు. మొదటి ఫాదర్ ఫాస్కలీ అనాథలు, వృద్ధులకు ఆశ్రయమిచ్చేందుకు స్థానికంగా అన్నమ్మ(మేరీమాత) పేరుతో మఠం స్థాపించారు. దీంతో అనేక మంది సిస్టర్స్ ఇక్కడికి వచ్చి పేదలు, వృద్ధులకు సేవలందిస్తున్నారు. అన్నమ్మ మఠం ద్వారా వైద్యశాల, సెయింట్ మేరీస్ పేరుతో ఉన్నత పాఠశాలను స్థాపించడంతో పేద విద్యార్థులు చదువుకుంటున్నారు. శుభవార్త చర్చి ద్వారా మఠంపల్లి నుంచి వెళ్లిన అనేక మంది మత గురువులు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చర్చిల్లో సేవలందిస్తున్నారు. ప్రతి ఏడాది చర్చి వార్షికోత్సవంలో భాగంగా ఏప్రిల్ 25న నిర్వహించే శుభవార్త చర్చి జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మత గురువులు, బిషప్‌లతో పాటు దేశవిదేశాల్లోని క్రైస్తవులు కూడా హాజరవుతుంటారు.

మంగళవార్త దేవాలయం నుంచి శుభవార్త చర్చిగా..

మఠంపల్లిలోని శుభవార్త చర్చికి గతంలో మంగళవార్త దేవాలయంగా పేరుండేది. అయితే కన్య మరియమాత గర్భంలో బాలయేసు జన్మించనున్నాడని గాబ్రియేల్(దేవదూత) దూత పలికిన శుభసూచికమైన వార్తనే శుభవార్తగా భావించి ఈ చర్చికి శుభవార్త చర్చిగా నామకరణం చేసినట్లు క్రైస్తవులు చెబుతున్నారు.

26నుంచి ఎడ్ల పందేలు..

చర్చి వార్షికోత్సవం సందర్భంగా స్థానిక శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో చర్చి కమిటీ సహకారంతో ఈ నెల 26 నుంచి 29 వరకు మాంట్‌ఫోర్ట్ హైస్కూల్ మైదానంలో రోజూ రాత్రి 10గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఎడ్ల పందేలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఎడ్లకు అన్నివిభాగాల్లో కలిపి రూ.8.78లక్షల నగదు బహుమతులతో పాటు షీల్డ్‌లు కూడా అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.